ప్రజాశక్తి

గురువారం 02 అక్టోబర్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

నేటితో దసరా ఉత్సవాలు ముగింపు

- పోటెత్తిన భవానీలు
- తెప్పోత్సవం రద్దు
- మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ దర్శనం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ముగియనున్నాయి. ఈ ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై 11 అలంకారాల్లో ఉన్న కనక దుర్గమ్మను సందర్శకులు దర్శించుకుంటున్నారు. నవరాత్రుల్లో 10వ రోజు బుధవారం మహా నవమి సందర్భంగా దుర్గాదేవిని శ్రీ మహిషాసురమర్దిని దేవిగా అలంకరించారు. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు దర్శించుకున్నారు.

టిటిడి తరపున పట్టువస్త్రాలు సమర్పణ

దుర్గమ్మకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరపున ఎక్స్‌-అఫీషియో సభ్యులు రామచంద్ర మోహన్ పట్టువస్త్రాలు(మిగతా 2లో)

నేడు గాంధీ హిల్‌కు సిఎం రాక వార్త 4లో

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబురావు

పేదల సమస్యలపై పోరాడిన జోనస్

సంతాప సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబురావు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : పేదల కోసం తుదిశ్వాస వరకు జోనస్ పోరాడారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు తోమంద్రు జోనస్ సంతాప సభ బుధవారం 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు మేకలవారి వీధిలోని ఆయన స్వగృహం వద్ద జరిగింది. ఈసభకు మాజీ కార్పొరేటర్, ఐద్వా నగర గౌరవాధ్యక్షురాలు గాదె ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సభలో సిహెచ్.బాబురావు మాట్లాడుతూ సిపిఎం నిర్వహించిన అనేక పోరాటాల్లో జోనస్ చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేశారు. రైల్వే ఉద్యోగిగా ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వ సస్పెన్షన్ గురై నిర్బంధాలు ఎదురైనా ఎత్తిన జెండా దించకుండా కార్మికుల హక్కుల కోసం, పేదల హక్కుల కోసం తుదిశ్వాస వరకు పోరాడిన ఉత్తమ కమ్యూనిస్టు జోనస్ అని కొనియాడారు. అప్పటి ఎమర్జెన్సీ రోజులే నేడూ మన కళ్ల ముందుకు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, సామాజిక న్యాయం, లౌకికవాదం ప్రమాదంలో ఉన్నాయన్నారు. వీటిని రక్షించాల్సిన పాలకులే వాటికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ప్రజలే రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ డివిజన్ అభివద్ధికి, సామాజిక న్యాయం, మతసామరస్యం కోసం జోనస్ ఎంతగానో కషి చేశారని అన్నారు. భార్య కన్నమ్మ మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. సిపిఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు టి.పైడయ్య, ఎంసిపిఐ నగర కార్యదర్శి కాసాని గణేష్, టిడిపి నాయకులు పి.రాజమోహన్, కెవిపిఎస్ నాయకులు కె.మోసెస్, సిఐటియు నగర కార్యదర్శి ఈవీ, బి మల్లేశ్వరరావు, ఎ.శ్రీనివాస్, సిపిఎం సీనియర్ నాయకులు నాయకులు జి.సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడుతూ జోనస్ సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

స్ఫూర్తివంతంగా దసరా సాంస్కృతికోత్సవాలు

- కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అభినందన
- ఆకట్టుకున్న వీర వనితల ప్రభ మహోత్సవం
- ఉర్రూతలూగించిన ప్రదర్శనలు

ప్రజాశక్తి - విజయవాడ : దసరా సాంస్కృతికోత్సవాల స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. నగరంలోని సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో బుధవారం దసరా సాంస్కృతికోత్సవాల వీరవనితల ప్రభ మహోత్సవం పెద్దఎత్తున జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అనేక వ్యయప్రయాసాలకోర్చి వినూత్న రీతిలో ఈ కార్యక్రమం నిర్వహించిన దసరా సాంస్కృతికోత్సవ కమిటీని, ఎంతో సృజనాత్మకతతో రకరకాల రూపాల్లో ప్రదర్శనలు ఇచ్చిన వారిని అభినందించారు. ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు ప్రజలందరినీ ఐక్యం చేయడానికి ఎంతో దోహదపడతాయన్నారు. పిల్లల్లో చైతన్యం కలిగించడానికి, సృజనాత్మకతను పెంపొదించుకోవడానికి ఒక మంచి అవకాశంగా ఉంటాయన్నారు. నేడు పిల్లలు ఇళ్లల్లో టివిలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయి వాటికి బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా వాటి నుంచి పిల్లలను దూరంగా ఉంచొచ్చని అన్నారు. అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు మాట్లాడుతూ కళల పట్ల పిల్లల్లో, పెద్దల్లో ఆలోచన రేకిత్తించడంతోపాటు ప్రజలను చైతన్య పరచడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీ కృష్ణ మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా దసరా సందర్భంగా ప్రజల సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

దసరా సాంస్కృతిక ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఆధ్వర్యాన జరిగిన వీర వనితల ప్రభ మహోత్సవ ర్యాలీ, కళా ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం ఆద్యాంతం ఎంతో ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. ఉదయం డాబాకొట్ల సెంటర్ నుంచి ఎంబి స్టేడియం వరకు చెడును దునుమాడి సమాజానికి సేవలందించిన 9 మంది వీరవనితల ప్రభమహోత్సవం జరిగింది. ఝాన్సీ లక్ష్మీబాయి, రాణిరుద్రమదేవి, సావిత్రీబాయిపూలే, మదర్ థెరిస్సా, హేమలత లవణం, దూబగుంట రోశమ్మ, కెప్టెన్ లక్ష్మీసెహెగల్, డాక్టర్ కొమ్మురాజు అచ్చమాంబ, వీరగున్నమ్మ వేషధారణలతో, చిత్ర పటాలతో వేలాది మంది బాలబాలికలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రదర్శన ప్రజలను ఆలోచింప చేసింది. నగరంలోని 15 విద్యాలయాల నుంచి దాండియా ప్రదర్శనలు, 7 జానపద, వెస్ట్రన్ నృత్యాల బృందాలు, 7 మహిళా కోలాటాల ప్రదర్శనలు, 18 డ్యాన్స్ స్కూళ్ల నుంచి శాస్త్రీయ నృత్యాలు యంబి స్టేడియంలో సాయంత్రం ప్రదర్శితమయ్యాయి. ఎంతో క్రమశిక్షణగా జరిగిన ఈసాంస్కృతిక ప్రదర్శనలు ఉర్రూతలూగించాయి. ఆద్యాంతం చూపురులను విశేషంగా ఆకట్టుకొని ఆనందింప చేశాయి. ఈ కార్యక్రమంలో దసరా సాంస్కృతిక ఉత్సవాల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.సంధ్యారాణి, అవనిగడ్డ పున్నారావు, నిర్వాహుకులు పి.ఐజాక్ న్యూటన్, గుండు నారాయణరావు, ఎంబివికె బాధ్యులు టి క్రాంతి కిరణ్, యువి రామరాజు, కె.స్వరూపరాణి పాల్గొన్నారు.

సభలో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తదితర ప్రముఖులు

నిలకడగా కృష్ణమ్మ

- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 6.69 లక్షల క్యూసెక్కులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రకాశం బ్యారేజి వద్ద కష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువ జలాశయాల నుంచి భారీగా వస్తున్న వరద ప్రవాహం ప్రకాశం బ్యారేజీకి చేరుతోంది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీకి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 6 లక్షల 68 వేల 981 క్యూసెక్కులుగా ఉంది. బ్యారేజీ 70 గేట్లలో 69 గేట్లను పూర్తిగా ఎత్తి సముద్రంలోకి వరద నీటిని విడుదల చేస్తున్నారు. కష్ణానది వరద ఉధృతి నేపథ్యంలో దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం జరగాల్సిన శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామివార్ల తెప్పోత్సవ నిర్వహణకు జల వనరుల శాఖాధికారులు అనుమతి నిరాకరించారు. ఇంద్రకీలాద్రికి విచ్చేసే యాత్రికులు, భవానీలు నదీ ఘాట్లవైపు వెళ్ళకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రెండంచుల బారికేడ్లతో భద్రత కల్పించాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ అధికారులకు సూచించారు.

పలువురు ఇఎస్‌ఐ వైద్యులకు ప్రమోషన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పలువురు ఇఎస్‌ఐ వైద్యులకు ప్రమోషన్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ గుణదల సిఎస్ ఆర్‌ఎంఒగా డాక్టర్ ఎం.జయశ్రీ, సర్జరీ డిపార్ట్మెంట్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా డాక్టర్ ఉప్పులేటి రాగదీపిక, పీడియాట్రిక్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా డాక్టర్ కె.శారదను నియమించింది. పుల్మోనోలజీ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా డాక్టర్ ఎం.సరళను డిప్యూటేషన్‌పై నియమించింది.

CHANGE OF NAME

I, SAGGHIBI SHAIK W/O.SHAIK ISMAIL (Old Name), residing at D.No.76-7-1/A, Sabhapathi Road, Bhavanipuram, Vijayawada, NTR District, Andhra Pradesh-520012. My Name has been changed to **SHAIK SAGGIBEE W/O.SHAIK ISMAIL (New name)**, . Here after my name is known as **SHAIK SAGGIBEE W/O.SHAIK ISMAIL (New name).**

Dhanekula Institute OF ENGINEERING AND TECHNOLOGY (AUTONOMOUS)

(Approved by AICTE, Affiliated to JNTU Kakinada)
NBA (ME, ECE, CSE & EEE) Accredited & An ISO 9001-2015 Certified
Ganguru, Vijayawada – 521 139 Ph.No. 8333924842/43, 9441037088
website : www.diet.ac.in, **EAPCET Code: DHAN**

Spot Admissions

Vacant seats in Second year B.Tech Lateral Entry in CIV, EEE, MEC, ECE, EII, CSE, CSM, CSD and IT arising out of not reporting/dropout/ unfilled & unfilled Cat.- B seats have to be filled up by the college as per guidelines of APSCHE.

Interested candidates are informed to report in the office by 9.00 AM on 06.10.2025 along with necessary original certificates (10th Marks & Diploma PC, TC, 6th to Diploma certificates, ECET Rank Card & Hall ticket.

Date : **01-10-2025**

Sd/.
Principal

నేటితో దసరా ఉత్సవాలు ముగింపు

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, నన్నపనేని సదాశివరావు, టి.జానకి దేవి, ఏ. రంగశ్రీ పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ఆదాయం

హుండీ ఆదాయం మినహా, లడ్డూ ప్రసాదం, టికెట్లు, అర్చనల ద్వారా రూ.3.50 కోట్లకుపైగా ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. తొమ్మిది రోజుల్లో 15 లక్షల లడ్డూలు విక్రయం కాగా, 2.90 లక్షల మంది అన్న ప్రసాదం స్వీకరించారు.

పోటెత్తిన యాత్రికులు, భవానీలు

శరన్నవరాత్రి వేడుకలకు సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. 9 రోజుల్లో 11 లక్షల మందికిపైగా దుర్గమ్మను దర్శించుకున్నారు. చివరి 2 రోజుల్లో మరో 3 లక్షల మంది వచ్చే అవకాశముంది. భవానీ మాలదారులు దీక్షా విరమణలో భాగంగా ఇంద్రకీలాద్రికి అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని అధికారుల అంచనా. బుధవారం రాత్రి 7 గంటల వరకు 79,596 మంది దర్శించుకున్నారు.

తెప్పోత్సవం రద్దు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో ఆఖరి ఘట్టంగా దసరా చివరి రోజు గురువారం సాయంత్రం నిర్వహించాల్సిన తెప్పోత్సవం రద్దయింది. ప్రకాశం బ్యారేజి వద్ద కష్ణా నదికి ఆరు లక్షల క్యూసెక్కులకుపైగా వరద కొనసాగుతుండడంతో తెప్పోత్సవం నిర్వహణకు జల వనరుల శాఖ అధికారులు అనుమతి ఇవ్వలేదు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. 2022, 2023లోనూ దశమి రోజు వర్షాలు కురవడంతో తెప్పోత్సవం రద్దయింది. ఈఏడాది కష్ణా నది వరద ఉధృతితో తెప్పోత్సవం రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు.

నేటితో ఉత్సవాలు ముగింపు

దసరా ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. చివరి రోజున దుర్గమ్మను శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరిస్తారు. ఇక దేవస్థానం ప్రాంగణం శివాలయంవైపు మార్గంలో గల పాత యాగశాలలో ఉదయం 9 గంటలకు ఆగమ శాస్త్ర ప్రకారం వేదక్తంగా నిర్వహించే పూర్ణాహుతి కార్యక్రమంతో శ్రీ విశ్వా వసూ నామ సంవత్సర దసరా ఉత్సవాలు ముగియనున్నట్లు దుర్గగుడి ఈవో శీనా నాయక్, వైదిక కమిటీ వారు వెల్లడించారు.

అత్యాచారానికి గురైన బాలికకు ఐద్వా నేతల పరామర్శ

ప్రజాశక్తి - విజయవాడ : బాబాయ్ చేతిలో లైంగిక దాడికి గురైన బాలికను బుధవారం ఐద్వా నాయకులు పరామర్శించారు. విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను ఐద్వా జిల్లా కార్యదర్శి కాజ సరోజ, విజయవాడ సెంట్రల్ సిటీ కార్యదర్శి జి.ఝాన్సీ, 64వ డివిజన్ అధ్యక్షులు లత పరామర్శించి, ధైర్యం చెప్పారు. నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసుకు సంబంధించి బాధిత బాలిక అజిత్‌సింగ్‌నగర్ మున్సిపల్ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. బాలికను పరామర్శించిన అనంతరం ఐద్వా నాయకులు మీడియాతో మాట్లాడుతూ అత్యాచారం చేసిన నిందితుడైన ఆమె బాబాయ్ ఇరుగుడు ప్రవీణ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాలికపై ఇటువంటి ఘటన చోటుచేసుకోవడం అత్యంత హేయమన్నారు. సభ్యసమాజం తలదించుకోవాల్సిన అంశమని పేర్కొన్నారు. తక్షణం నిందితుడిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ బాలికకు ప్రభుత్వం రక్షణ కల్పించి, అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా ఉండేందుకు పాఠశాలల విద్యార్థులకు గుడ్‌టచ్, బాడ్‌టచ్ గురించి అవగాహన కల్పించాలని సూచించారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బందరు పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరితో కలసి బుధవారం నగరంలోని రహదారులు భవనాల అతిథి గృహంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. పింఛన్లు, స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, మెగా డీఎస్సీ నిర్వహణ సహా హామీలన్నీ పక్కాగా అమలు చేసి సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు. మెగా డీఎస్సీతో దాదాపు 16 వేల ఉపాధ్యాయ నియామకాలను పారదర్శకంగా నిర్వహించి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు.

గుంతల రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం ద్వారా రోడ్లకు మరమ్మతులు చేపట్టామని, దీనితో పాటు అన్ని రకాల అభివద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. రూ.2 కోట్ల వ్యయంతో విజయవాడ రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టామని, మూడు స్తంభాల సెంటర్ నుండి రైల్వే స్టేషన్ వరకు 80 అడుగులకు విస్తరించేందుకు కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ఖేలో ఇండియా పథకం కింద రూ.13 కోట్లతో గతంలో ఆగిపోయిన పనులను ప్రారంభించామన్నారు. 2047 నాటికి దేశంలోనే అగ్రస్థాయి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దడం కోసం కూటమి ప్రభుత్వం కష్టబడి పని చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఎంపి బాలశౌరి మాట్లాడుతూ రాష్ట్ర అభివద్ధి కోసం టీడీపీ జనసేన బీజేపీ కలిసి నడుస్తున్నాయన్నారు. అమరావతి, పోలవరం, స్టీల్ ప్లాంట్ సహా అనేక ప్రాజెక్టులు పూర్తి కాబోతున్నాయన్నారు. ఈ సమావేశంలో డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పాల్గొన్నారు

బీచ్ వద్ద మందుబాబుల వీరంగం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం మండలం మంగినపూడి బీచ్ వద్ద బుధవారం మందుబాబులు వీరంగం సృష్టించారు. మద్యం మత్తులో ముగ్గురు వ్యక్తులు ఒక ఆటో డ్రైవర్‌ను కొట్టి సత్రవపాలెం దగ్గర పారిపోతుండగా స్థానికులు అడ్డుపడి పోలీస్‌స్టేషన్ తరలించారు. ముగ్గురు వ్యక్తులు పోర్టు పనుల నిమిత్తం వచ్చారని స్థానికులు చెబుతున్నారు. గాయపడిన వ్యక్తిని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గూడూరు ఎంపిడిఒగా శైలజాకుమారి

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.శైలజాకుమారిని నియమిస్తూ జిల్లా పరిషత్

సీఈవో కన్నమ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం శైలజాకుమారి బాధ్యతలు స్వీకరించారు. శైలజాకుమారి బంటుమిల్లి పిఓపిఆర్డిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై గూడూరు ఎంపీడీవోగా వచ్చారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-మోపిదేవి: మండల కేంద్రమైన మోపిదేవి శివారు రావివారిపాలెం గ్రామంలో విజయ పాల కేంద్రం వద్ద రైతులకు బుధవారం బోనస్ పంపిణీ చేశారు. మొత్తం 157 మంది రైతులకు 1,70,465 రూపాయలను పామర్రు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ చిట్టూరి గోపీనాథ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షులు రావి లక్ష్మణరావు, రావి ప్రభుప్రసాద్ (భుట్టో), రావి రామనాథం, గవిని శివరామకృష్ణ, బండి రామకృష్ణ, వేములపల్లి పిచ్చేశ్వరరావు, ఏఎంపిఓ సురేష్ కుమార్, సూపర్వైజర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సమాజంలో వృద్ధుల పాత్ర కీలకం : జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): వృద్ధుల అనుభవం, జ్ఞానం, సలహాలు సమాజ నిర్మాణానికి విలువైనవని, సమాజంలో సాంప్రదాయ విలువలను, సంస్కృతిని నిలబెట్టడంలో ముఖ్య పాత్ర పోషిస్తారని జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు వయోవృద్ధులను, వద్ధుల ఆశ్రమ నిర్వాహకులను సన్మానించారు. అనంతరం తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం, 2007 గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వద్ధులు సమాజ నిర్మాణానికి కీలకమైనవారే అయినప్పటికీ వారి పాత్ర, గౌరవం, ఆధునికత, సామాజిక మార్పుల కారణంగా క్షీణిస్తోందన్నారు. వారిని సమాజ నిర్మాణ కారకులుగా పరిగణించడానికి, వారిని గౌరవించడం, వారి అనుభవాన్ని ఉపయోగించుకోవడం, వారి మానసిక, శారీరక శ్రేయస్సును పెంపొందించడం చాలా అవసరం అన్నారు. విలువలు లేని సమాజం కూలిపోతుందని, సమాజంలో విలువలు

పెంపొందించడానికి వద్ధుల సహకారం ఎంతో అవసరమని పేర్కొంటూ, కుటుంబాలలో వారి మనవళ్లు మనవరాళ్లకు బలవంతంగానైనా నైతిక విద్య, జీవిత పాఠాలు నేర్పించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. తన దష్టికి తీసుకువచ్చిన సమస్యలపై ప్రభుత్వానికి నివేదించి పరిష్కారానికి కషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి వి.కామరాజు, వయోవృద్ధుల సంఘం అధ్యక్షుడు గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0పై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలు ప్రతిఒక్కరికీ అందేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిఎస్టి 2.0 సంస్కరణల ప్రచార కమిటీ సభ్యులతో సమావేశమై విస్తృత ప్రచారానికి తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కిరాణా సామాగ్రి, ఆరోగ్యం జీవిత బీమా, దుస్తులు, పాదరక్షలు, ఔషధాలు, స్టేషనరీ, ఎలక్ట్రానిక్, రవాణ, వ్యవసాయ పరికరాలు, రోజువారీ నిత్యవసరాలు తదితర వస్తువులు తగ్గించిన జిఎస్టి ధరలతో తక్కువ ధరకే పొందవచ్చున్న విషయాన్ని ప్రజలకు తెలియపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దీనిపై విస్తత ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు. దీనికోసం తొలిగా పట్టణ ప్రాంతంలో ప్రచార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అక్కడ వివిధ శాఖలకు సంబంధించి స్టాల్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఆ కార్యక్రమంలో ఆయా శాఖలు గతంలోని ధరలకు జీఎస్టీ తగ్గింపుతో వచ్చిన ధరలను ప్రజలకు వివరించి అవగాహన కలిగించాలని సూచించారు. దీనిపై ప్రచార కమిటీ సభ్యులు ప్రత్యేక దష్టి పెట్టి కార్యచరణ రూపొందించాలని జేసీ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ కల్పన, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా అధికారి జడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, డిపిఓ డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

మోపిదేవి ఆలయాన్ని సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవిలోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎ.భూపాల్‌రెడ్డి, జంతు సంపద జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.చిన్న నరసింహులు, మోపిదేవి వెటర్నరీ డాక్టర్ నందకిషోర్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని నాగపుట్టలో పాలు పోశారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదన్‌రావు ఆలయ మర్యాదలతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-మొవ్వ: మండల కేంద్రమైన మొవ్వలో శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో బుధవారం దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకుని పదో రోజు శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారిని అష్టలక్ష్మి అమ్మవారిగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సామ్రాజ్యం, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వర రావు, గొరుపర్తి వెంకటరమణమూర్తి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. **మోపిదేవి:** పెదకళ్లేపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ కాళికాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. కొక్కిలిగడ్డ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ నిర్వాహకులు కొక్కిలిగడ్డ రాము ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. **గుడ్లవల్లేరు:** వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, మాజీ సర్పంచి కొడాలి రామరాజు, తొలి ఆలయ మేనేజర్ జక్కా ధర్మారాయుడు తదితరులు పాల్గొన్నారు. **మచిలీపట్నం అర్బన్:** దసరా

కొండలమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు

మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈడేపల్లి శక్తి గుడి ఆలయంలోని కాళికామాతను మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెడ్‌క్రాస్ చేయూత

ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ మండలం భట్ల పెనుమర్రులో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చదువుల లక్ష్మి కుటుంబానికి బుధవారం రెడ్ క్రాస్ సొసైటీ వంట, వడ్డన సామాగ్రి, తార్పాలిన్, కాస్మోటిక్స్, బక్కెట్ పంపిణీ చేశారు. రెవెన్యూ అధికారులు బియ్యం, నిత్యావసర వస్తువులు రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు

తాసిల్దార్ కె మస్తాన్ రావు, మొవ్వ మండల శాఖ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, ఎంపీపీ కొండేటి ఇందిర, సర్పంచ్ మట్టా ఇందిర భర్త సతీష్ ఐదు వేల రూపాయలు, కూచిపూడి రోటరీ క్లబ్ అధ్యక్షులు సిలికాన్ ఆంధ్ర ఏవో జొన్నలగడ్డ హనుమకుమార్ రెండు వేల రూపాయలు, శాసనసభ్యులు వర్ల కుమార్ చదువుల లక్ష్మిని పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టిపాటి శ్రీధర్, పరుచూరి శ్రీనివాసరావు, వీరంకి తులసిదాస్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఎస్ కె రంగావలి, కే రామాంజనేయులు, పాగోలు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మొవ్వ: పెడసనగల్లు నుండి అయ్యంకి వరకు ఉన్న రోడ్డు పూర్తిగా శిథిలమైపోయింది. ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడటం చూసిన టిడిపి జిల్లా కార్యదర్శి నన్నపనేని వీరేంద్ర సొంత నిధులు పది లక్షల రూపాయలతో చేపట్టిన రోడ్డు పనులను శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా బుధవారం

ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి: వైసిపి బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావు, ఏలూరు శ్యాంమోహన్ అందించిన రూ.5 వేలు ఆర్థిక సహకారాన్ని అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వక్కలగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన దాసి మోహన్‌రావుకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దాల వీరాస్వామి, ఆలూరి బాబురావు, పఠాన్ కరీముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాష్ట్ర ప్రభుత్వం పింఛనుదారులకు ప్రతి నెలా మొదటి రోజునే పింఛన్లను అందించి ఆర్థిక భద్రత కల్పిస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం ఆయన ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ (డిసిఎంఎస్) బండి రామకృష్ణతో కలిసి నగరంలోని

12వ డివిజన్ నోబుల్ కాలనీలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఇంటింటికి తిరిగి స్వయంగా పింఛన్లు అందించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ మెంబర్ లంకె నారాయణ ప్రసాద్, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మచిలీపట్నం టౌన్ పార్టీ ప్రెసిడెంట్ లోగిశెట్టి వెంకట స్వామి, 12వ డివిజన్ ఇంచార్జ్ బొమ్మిడి శ్రీరాములు, మాదివాడ రాము పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** గుడ్లవల్లేరులో ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఇంటి వద్దనే ప్రభుత్వ పింఛన్లు పంపిణీ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, పీఏసీఎస్

అధ్యక్షుడు వెనిగళ్ల నాగేశ్వరరావు, డోకిపర్రు టీడీపీ అధ్యక్షుడు వీరమాచినేని శివప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ తెల్లాకుల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి మహిళ మృతి

విచారణ చేపడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వైద్యం వికటించి మహిళ మృతి చెందిన సంఘటన జగ్గయ్యపేట పట్టణంలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు పట్టణంలోని చెరువు బజారుకు చెందిన గుంజ గాయత్రి (25) ప్రసవం నిమిత్తం ఆదివారం స్మైలీ ప్రైవేట్ ఆస్పత్రిలో చేశారు. గాయత్రి సోమవారం శిశువును ప్రసవించింది. అయితే, గాయత్రికి అధిక రక్తస్రావం అవడంతోపాటు గుండె నొప్పి రావడంతో హస్పటల్ యాజమాన్యం విజయవాడ హాస్పటల్‌కు రిఫర్ చేశారు. విజయవాడలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందారు. దీంతో మృతురాలి బంధువులు జగ్గయ్యపేటలోని స్మైల్ హాస్పటల్ వద్ద ఆందోళనకు దిగారు. నిర్లక్ష్యంగా వైద్యం చేయడంతోనే గాయత్రి మృతి చెందిందని ఆందోళన చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి బంధువులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మహిళ మృతిపై విచారణ

పట్టణంలోని స్మైల్ హాస్పిటల్‌లో మహిళ మృతిపై జిల్లా వైద్య ఆరోగ్యాధికారి (డీఎమ్‌హెచ్‌ఓ) సుహాసిని తక్షణమే స్పందించారు. బుధవారం హాస్పిటల్‌ను సందర్శించి వివరాలు సేకరించారు. ఈ ఘటనకు సంబంధించి వాస్తవ పరిస్థితులు, కారణాలు, వైద్యపరమైన చర్యలు, వైద్య సిబ్బంది వైఖరిని లోతుగా పరిశీలించడానికి ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు.

పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని రావిరాల గ్రామంలో కృష్ణా నది వరద ముంపునకు గురై దెబ్బతిన్న పంట పొలాలను, నివాస గృహ ప్రాంతాలను బుధవారం జగ్గయ్యపేట నియోజక వర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు ఏలూరి శివాజీ, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్న), రాష్ట్ర రైతు విభాగ ప్రధాన కార్యదర్శి చిరుమామిళ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద కారణంగా వరి, పత్తి, మిరప, చెరుకు, పసుపు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా ముగిసిన యోగాసన పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరంలోని పిబి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో నాలుగు రోజులపాటు జరిగిన 6వ జాతీయ జూనియర్, సీనియర్-సి యోగాసన ఛాంపియన్‌షిప్ బుధవారం ఉత్సాహంగా.. ఉల్లాసంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా సాధన ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరదారుఢ్యం పెంపొందుతుందని తెలిపారు. గౌరవాధ్యక్షుడుగా హాజరైన యోగా భారత్ ప్రధాన కార్యదర్శి జైదీప్ ఆర్య మాట్లాడుతూ ఈ పోటీల నుంచి భారత జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే ఏడాది జపాన్‌లో జరిగే ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో తలపడతారన్నారు. రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. అమరావతికి ఒక ప్రత్యేక స్థానం కల్పించేందు గత మూడు నెలలుగా పోటీల నిర్వహణా కమిటీలు విశేషంగా కృషి చేశాయని కొనియాడారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జి జస్టిస్ శేషసాయి, ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, సిద్ధార్థ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు మలినేని రాజయ్య, పాలడుగు లక్ష్మణరావు. రాష్ట్ర ప్రైవేటు వైద్య దంత కళాశాలలు యాజమాన్య సంఘం అధ్యక్షుడు జి.భాస్కరరావు ఎన్టీఆర్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాషా, రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం అధ్యక్షురాలు ఎ.రాధిక, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

వీధి కుక్కల స్వైర విహారం

- పలువురికి గాయాలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ: విజయవాడ పశ్చిమంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్న పిల్లలనే కాదూ.. పెద్దలనూ వెంటపడి కరుస్తున్నాయి. మొగల్రాజపురంలో భగీరథ విశ్వనాథం పది రోజుల క్రితం వీధి కుక్కల దాడికి గురయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాక్సిన్లు వేయించుకున్నా మంగళవారం మరణించారు. పాత రాజరాజేశ్వరి పేటకు చెందిన శ్రీను (50) అనే కార్మికుడు, మరో నలుగురిపై వీధికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. చిట్టినగర్ కుండ్లమార్కెట్లో గాలి పాండురంగ (36) అనే కార్మికునిపై దాడి చేశాయి. సామా రంగం చౌక్ సెంటర్ సమీపంలో ఐ.వి.రమేష్ అనే వ్యక్తిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. కొత్తపేట షేక్ రాజా ఆసుపత్రిలో వైద్య చికిత్స కోసం వచ్చిన బాధితులను కలిసి సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్తిబాబు పరామర్శించారు. వీధి కుక్కలతో బెజవాడ ప్రజలు బెంబేలెత్తుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలను అరికట్టాలని కౌన్సిల్లో అనేకమార్లు తీర్మానాలు చేసినా ఆచరణలో చర్యలు మాత్రం కనిపించలేదన్నారు. నగరంలో వీధి కుక్కలు వీధివీధిన విజృంభిస్తు ప్రజలపై దాడులు చేస్తూ ప్రాణాలను బలితీసుకుంటున్నా విఎంసి అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటు అన్నారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం

కార్యక్రమంలో మాట్లాడుతున్న గుమ్మా సాంబశివరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పటమటలోని అసోసియేషన్ కార్యాలయలో ప్రపంచ వృద్ధుల దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రా లయోలా కళాశాల రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ అన్ని అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగినవారని తెలిపారు. నేటి యువత వారి సూచనలు, సలహాలు తీసుకొను భవిష్యత్తు నిర్మాణం చేసుకోవాలని అన్నారు. అలాగే నేడు సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి వివరించారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కోమటినేని నాంచారయ్య మాట్లాడుతూ వృద్ధుల సమస్యల పరిష్కారానికి వృద్ధుల కమిషన్ ఏర్పాటు చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు వృద్ధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షులు పొన్నగంటి సాంబశివరావు అధ్యక్షత వహించగా, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ వెన్నా వల్లభ రావు, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధినేత గోళ్ళ నారాయణరావు, పలువురు పాల్గొన్నారు.

సిఎంను కలిసే అవకాశం కల్పించండి

- కలెక్టర్‌ను కోరిన ఆటో వర్కర్స్ యూనియన్ నేతలు

ప్రజాశక్తి-విజయవాడ : "వాహన మిత్ర" పథకం అమలు నేపథ్యంలో సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఈ నెల 4న జరిగే బహిరంగ సభకు విచ్చేస్తున్న సిఎం చంద్రబాబుకు ఆటో కార్మికుల సమస్యలను వినతిపత్రం రూపంలో తెలియజేయడానికి అవకాశం కల్పించాలని పలు యూనియన్ల నేతలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశాను విజ్ఞప్తి చేశారు. వాహన మిత్ర పథకంలో భాగంగా ఆటో కమ్ ఓనర్‌కు రూ.15000 పంపిణీ కార్యక్రమానికి సిఎంతో పాటు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ హాజరయ్యే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక కలెక్టర్ చాంబర్‌లో బుధవారం ఆయా ఆటో వర్కర్స్ యూనియన్ల నేతలతో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ల నేతలు మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. వాహన మిత్ర పథకం ప్రారంభోత్స కార్యక్రమానికి విచ్చేసే సిఎం చంద్రబాబుకు విన్నవించుకునేందుకు అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నగర కార్యదర్శి కె దుర్గారావు, నాయకులు ఎం హనుమంతరావు, పి గణేష్ (చిన్న), ఎవి రెడ్డి, ఐఎఫ్‌టియు నాయకులు దాది శ్రీనివాసరావు, టిఎన్‌టియుసి నాయకులు జి చిన్న, ఎఐటియుసి నాయకులు జి జనార్ధన్ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-ఎ.కొండూరు : కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఎ.కొండూరు మండలం మత్రియ తండా పంచాయతీ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. చైతన్యనగర్ తండాకు చెందిన బాణవతు రాముడు (75) గత కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాముడు కిడ్నీ వ్యాధి సోకినప్పటి నుండి లక్షలాది రూపాయలు ఖర్చు చేశామని మృతుని భార్య, పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు, సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆళ్ళ అమ్మి రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా గిరిజన నాయకులు కుమార్ డిమాండ్ చేశారు.

అల్ట్రాటెక్ ఫ్యాక్టరీలో ప్రమాదం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని బూదవాడ గ్రామ సమీపంలోని అల్ట్రాటెక్ కర్మాగారంలో ప్రమాదం జరిగిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్మాగారంలో బాయిలర్‌ను కార్మికులు ఆదివారం శుభ్రం చేస్తుండగా బూడిద వేదజల్లడంతో బీహార్ రాష్ట్రానికి చెందిన సంజయ్ కుమార్ యాదవ్, ముఖేష్‌తోపాటు మరో ఇరువురికి గాయాలైనట్లు సమాచారం. ఈ ఘటనను యాజమాన్యం గోప్యంగా ఉంచినట్టు తెలుస్తోంది. చిల్లకల్లు ఎస్ఐ టి సూర్య శ్రీనివాస్, తహశీల్దార్ మనోహర్ అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్లి పరిశీలించారు. కార్మికుల సమాచారం ఇవ్వకపోవడంతో కంపెనీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

నేడు మాంసం దుకాణాలు బంద్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని మాంసం దుకాణాలు మూసివేయాలని పురపాలక సంఘం కమిషనర్ కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు గాంధీ హిల్‌కు సిఎం రాక

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : గాంధీ జయంతి సంధర్భంగా గాంధీ హిల్ నందు సిఎం చంద్రబాబు నాయుడు పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు ఇతర శాఖల అధికారులతో కలిసి గాంధీ హిల్‌ను సందర్శించారు. గాంధీ హిల్ పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలను సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో మంత్రులు, విఐపిలు, ఇతర అధికారులు కార్యక్రమానికి హాజరవుతారని పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు.

అదనంగా వసూలు చేసిన విద్యుత్ ఛార్జీలను ట్రూ డౌన్ చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం నిజంగా ట్రూడౌన్ చేయాలంటే మూడు పంపిణీ సంస్థల పరిధిలో యూనిట్‌కు 0.40 పైసల చొప్పున వసూలు చేసిన మొత్తం రు.2787.19 కోట్లు వినియోగదారులకు వాపసు చేయడంతోపాటు ఎపిఇపిడిసిఎల్ పరిధిలో వినియోగదారులకు విద్యుత్ నియంత్రణా మండలి నిర్ధారించిన రు.370.13 కోట్లు కూడా తిరిగి జమ చేసి, ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక డిమాండు చేసింది. స్థానిక బెల్లపు శోభనాద్రి గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐక్యవేదిక కన్వీనర్ యంవి ఆంజనేయులు మాట్లాడారు. విద్యుత్ పంపిణీ సంస్థల సమర్థతను పెంచి ఖర్చులు తగ్గించి, దానిద్వారా వచ్చిన మిగులును వినియోగదారులకు పంచితే అది నిజమైన ట్రూ డౌన్ అవుతుంది తప్ప ఒక ప్రాంత వాసులకు అన్యాయం చేసి మరో ప్రాంత వాసులకు ఇస్తే అది నిజమైన ట్రూ డౌన్ కాదని పేర్కొన్నారు. ఇప్పుడు ఎపిఇపిడిసిఎల్ పరిధిలో తగ్గిన రు.370.13 కోట్లు కూడా ఆ ప్రాంతలో అనేక పరిశ్రమలు మూతబడటం, కొన్ని పరిశ్రమలు ఉత్పత్తిని తగ్గించుకోవటం ద్వారా విద్యుత్ వినియోగం 21.27 శాతం తగ్గటం వలన జరిగింది తప్ప విద్యుత్ పంపిణీ సంస్థల సమర్థతను పెంచటంవలన కాదన్నారు. పైగా యూనిట్‌కు 0.40 పైసలు పెంచి వసూలు చేసి, అందులో 0.13 పైసలు తగ్గించి, చార్జీలు తగ్గించామని చెప్పటం హాస్యాస్పదమన్నారు. గత పాలనలో ట్రూ అప్ చేస్తే తమపాలనలో ట్రూడౌన్ చేశామని, 2024-2025 ఆర్థిక సంవత్సరానికిగాను ఇంధన సర్దుబాటు చార్జీలు క్రింద రు.924 కోట్లు వినియోగదారులకు వాపసు ఇవ్వబోతున్నా మని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటం రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టడమేనని అన్నారు. ఉమ్మడి గోదావరి, ఉత్తరాంధ్ర వినియోగదారులకు వాపసు ఇవ్వవలసింది పూర్తిగా ఇవ్వకుండా, కొంతభాగాన్ని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు మళ్ళిస్తున్నారు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరూపాయికూడా విద్యుత్ చార్జీలకు ఇవ్వటంలేదన్నారు. సమావేశంలో ఐక్యవేదిక నాయకులు వి సాంబిరెడ్డి, వి సుందరరామరాజు, యువి కృష్ణయ్య పాల్గొన్నారు.

తరలివస్తున్న భవానీలు

దుర్గమ్మ దర్శనానికి తరలివస్తున్న భవానీలు

నేటితో ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ముగింపు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ, విజయవాడ, అర్బన్

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో పదో రోజు బుధవారం మహా నవమి సందర్భంగా దుర్గాదేవి శ్రీ మహిషాసురమర్దిని దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. టీటీడీ దేవస్థానం తరుపున ఎక్స్-అఫీషియో సభ్యులు రామచంద్ర మోహన్ బుధవారం అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఇరు తెలుగు రాష్ట్రాలపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని టీటీడీ బోర్డు సభ్యురాలు సుచిత్ర ఎల్లా ఆకాంక్షించారు. బుధవారం ఆమె, ఇతర బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, టి. జానకి దేవి, ఏ. రంగశ్రీలతో కలిసి టీటీడీ తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. విజయవాడ కనకదుర్గమ్మ శరన్నవరాత్రులకు 11 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. హుండీ ఆదాయం మినహా, లడ్డూ ప్రసాదం, టికెట్లు, అర్చనల ద్వారా రూ.3.50 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శరన్నవరాత్రి వేడుకలకు యాత్రికులు భారీగా తరలివస్తున్నారు. చివరి రెండు రోజులలో భవానీ మాలదారులు దీక్షా విరమణలో భాగంగా ఇంద్రకీలాద్రికి అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తెప్పోత్సవం రద్దు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు సాయంత్రం నిర్వహించే తెప్పోత్సవం ఈ ఏడాది రద్దు అయ్యింది. కృష్ణానదికి వరద కొనసాగుతుండడంతో తెప్పోత్సవం నిర్వహణకు నీటి పారుదల శాఖ అనుమతి ఇవ్వలేదు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. 2022, 2023లోనూ దశమి రోజు వర్షం కురవడంతో తెప్పోత్సవం రద్దైంది. ఈ ఏడాది కష్ణా నది ఉప్పొంగి ప్రవహిస్తున్నందున తెప్పోత్సవం రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు.

నేటితో ఉత్సవాలు ముగింపు

ఇంద్రకీలాద్రిపై గత పది రోజులుగా జరుగుతున్న దసరా ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి. ఉత్సవాల ముగింపులో భాగంగా ఆఖరి రోజు గురువారం శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో జగన్మాత యాత్రికులను అనుగ్రహించనుంది. ఇక దేవస్థానం ప్రాంగణం శివాలయం వైపు మార్గంలో గల పాత యాగశాలలో ఉదయం 9 గంటలకు ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించే పూర్ణాహుతి కార్యక్రమంతో శ్రీ విశ్వా వసూ నామ సంవత్సర దసరా ఉత్సవాలు ముగియనున్నట్లు దుర్గగుడి ఈవో శీనా నాయక్ తెలిపారు.

నేడు విఐపి దర్శనాలు రద్దు

అమ్మవారి దర్శనానికి భవాని దీక్షధారులు అధికంగా తరలివస్తున్నందున గురువారం విఐపి, ప్రోటోకాల్ దర్శనాలను రద్దు చేశామని దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు. దసరా రోజున అన్ని క్యూ లైన్లలో ఉచిత దర్శనాలు కొనసాగుతాయని చెప్పారు. భక్తుల రద్దీ రీత్యా తెల్లవారుఝామున రెండు గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తామని చెప్పారు. క్యూలైన్లోని భక్తులందరికీ లడ్డు ప్రసాదాన్ని ఉచితంగా అందజేస్తామన్నారు. తెప్పోత్సవం లేనందున శివాలయం నుంచి దుర్గా ఘాట్ వరకు ఊరేగింపుగా వెళ్లి శాస్త్రోక్తంగా జరపాల్సిన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

టిటిడి తరపున పట్టు వస్త్రాలు సమర్పణ

ఆకట్టుకున్న నృత్య రూపకాలు

ప్రజాశక్తి-విజయవాడ, సిటీ, అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సొసైటీ ఫర్ వైబ్రేంట్ విజయవాడ సారధ్యంలో వరల్డ్స్ బిగ్గెస్ట్ ఫెస్టివ్ కార్నివల్ 'విజయవాడ ఉత్సవ్'లో భాగంగా నగరంలోని ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో పదో రోజు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విశాఖపట్నంకు చెందిన విజయ కుమార్ శర్మ బృందం కాళికామాత నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. భక్తి, శక్తి, ఆరాధన ఈ మూడు కలిసిన మహాశక్తి రూపంలో కాళికామాత నత్యం ఆద్యంతం ప్రేక్షకులను మెప్పించింది. రక్తబీజాక్షరుడు సంహరించేటప్పుడు కాళికామాత భయంకరమైన నాట్య ప్రదర్శనకు ప్రేక్షకులు గగుర్పాటుకు లోనయ్యారు. కాళికామాతగా రోహిణి మౌర్య అద్భుత ప్రదర్శన చేశారు. విజయవాడకు చెందిన జి.ప్రియ 24 మంది బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన కన్నుల పండువుగా సాగింది. వీరిలో 15 మంది చిన్నారులతో మూషిక వాహన, గరుడగమన పాటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్య రవళి ఆత్యద్భుతంగా ఉంది. విజయవాడ ఉత్సవ్ గిన్నిస్ రికార్డు సాధించేందుకు కషి చేస్తోంది. గురువారం సాయంత్రం 4 గంటల నుంచి మహాత్మాగాంధీ రోడ్డులో మెగా కార్నివాల్కు ఏర్పాట్లు చేశారు. కళ, సంస్కృతి, భక్తి సమ్మేళనంగా జరిగే కార్నివాల్లో మూడు వేల మంది కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ఈవెంట్ జరగనుంది. వెయ్యి మంది డప్పు కళాకారులతో ప్రదర్శన ఇవ్వడం ద్వారా గిన్నిస్ రికార్డు సాధించడమే లక్ష్యంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వంటల పోటీలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామీణ యువజన వికాస సమితి ఆధ్వర్యంలో వంటల పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సతీమణి విజయలక్ష్మి, వెంకట్రాం, సాయి సుప్రియ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీలను మండలి విజయలక్ష్మి కుమార్తె సేలం కృష్ణప్రభ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంవీ కష్ణారావు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ పోటీలలో పాల్గొన్న మహిళలు విభిన్న వంటకాలు చేశారు. అవనిగడ్డ మల్లేశ్వరి మొదటి బహుమతిగా రూ 7500, ఆకుల నాగలక్ష్మి సుగుణకుమారి ద్వితీయ బహుమతిగా రూ 500, మూడో బహుమతి కింద పసుపులేటి నాగలక్ష్మి రూ 2500 అందుకున్నారు. మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ ఆధ్వర్యంలో గాంధీచేత్రావరణలో బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శీలం అశ్విని కుమార్, తెలుగు మహిళా అధ్యక్షురాలు తలసిల స్వర్ణలత, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు బోలెమ్ నాగమణి, పైడిపాముల కృష్ణకుమారి, పైడిపాముల స్వప్న పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. కంచికచర్లకు చెందిన కాకతీయ ఫౌండేషన్ నిర్వాహకులు దసరా పండును పురస్కరించుకుని పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు బహూకరించారు. బుధవారం స్థానిక ఓసి క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐ బి.చవాన్, ఎంపిడిఓ డి వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ కోగంటి బాబు, సర్పంచ్ వేల్పుల సునీత, కార్యదర్శి సుబ్రమణ్యం, ఫౌండేషన్ సభ్యులు, టిడిపి నాయకులు వేమా కిషోర్, గుత్తా రత్నం తదితరులు పాల్గొన్నారు

మోహనరావుకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి -వీరులపాడు : ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు మండలంలోని వీరులపాడు గ్రామానికి చెందిన కొచ్చర్ల మోహనరావుకు తెలంగాణ రాష్ట్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన 26వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్, వర్సిటీ ఛాన్సలర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదగా డాక్టరేట్ ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయ విద్యా శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ జి.మేరీ సునంద పర్యవేక్షణలో విద్యా విభాగంలో వర్సిటికి సమర్పించిన పరిశోధనకుగాను ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ మోహనరావు ప్రస్తుతం కృష్ణాజిల్లా అంగలూరులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థలో గణిత శాస్త్ర అధ్యాపకునిగా పని చేస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామస్థులు, సహాధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఐడియాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం ఘనంగా జరిగింది. తిరువూరు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది వృద్ధులను ఐడియాస్ జనరల్ మేనేజర్ అవ్వారి అంతయ్య, డైరెక్టర్ శౌరిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొంతమంది కొడుకులు, కూతుర్లు పెన్షన్ వచ్చిన గంటలోనే వృద్ధ తల్లిదండ్రుల నుండి డబ్బులు తీసుకొని వారి యోగక్షేమాలను విస్మరిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలకు ఉపయోగపడతాయన్న ప్రధాన ఉద్దేశంతోనే ప్రభుత్వం వారికి పెన్షన్ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మేరీ రాణి, కోఆర్డినేటర్ కొంగల రవి బాబు, తదితరులు పాల్గొన్నారు.

బూడిద టెండర్ రద్దు చేయాలని దీక్షలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఎన్‌టిటిపిఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ తలపెట్టిన రిలే నిరసన దీక్షలు బుధవారంనాటికి 13వ రోజుకు చేరాయి. ఉచిత బూడిద లోడింగ్ చేయాలని, బూడిద అమ్మకం కాంట్రాక్టు రద్దు చేయాలని కోరుతూ దీక్షలు కొనసాగుతున్నాయి. జెన్కో సంస్థ తన స్వలాభం కోసం స్థానిక ట్రాన్స్పోర్టర్స్ పొట్ట కొట్టే నిర్ణయం తీసుకోవడం వల్ల నెల రోజులుగా లారీ లకు కిరాయిలు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని సొసైటీ అధ్యక్షుడు కోయ వెంకట్రావ్ తెలిపారు. కొండపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు దీక్షదారులకు నిమ్మ రసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. మైలా సైదులు, సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు ఉదారంగా రుణాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తిరువూరు : పిఎం స్వానిధి పథకంలో పూచీకత్తులేని రుణాలు తీసుకుని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ (పిడి) మురళి కృష్ణప్రసాద్ మహిళలకు, చిరు వ్యాపారులకు పిలుపునిచ్చారు. మెప్మా ఆధ్వర్యంలో తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో వీధి వ్యాపారులకు లోక్ కళ్యాణ్ మేళా బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రాజెక్ట్ డైరెక్టర్లు మాట్లాడుతూ ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వానిధి) పథకం, మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మునిసిపల్ ఏరియాస్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిస్తాయని తెలిపారు. ఈ పథకం వీధి వ్యాపారుల ఆర్థిక సాధికారతకు ఒక గొప్ప మార్గమని అన్నారు. ఈ పథకం ద్వారా పూచీకత్తు లేకుండానే సులభంగా రుణాలు పొందవచ్చని తెలిపారు. ఈ రుణాలు తక్కువ వడ్డీకే లభిస్తాయని, సకాలంలో చెల్లిస్తే ఏడు శాతం వడ్డీ రాయితీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ కొలికపోగు నిర్మల, కమిషనర్ మనోజ, మెప్మా అధికారిణి ఎస్.సుధారాణి, తిరువూరు సిఓ రవి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- నందిగామ : దసరా సందర్భంగా నందిగామ పట్టణంలోని 9వ వార్డు ముక్కపాటి నగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత క్రీడల వైపు మరింతగా ఆకర్షితులై తమ ప్రతిభను నిరూపించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-వత్సవాయి : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని రాష్ట్ర నెట్ కాఫ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ అన్నారు. పెనుగంచిప్రోలు మండలంలోని అనిగండ్లపాడు దళితవాడలో విజయదశమి సందర్భంగా కబడ్డీ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కీసర చందు, దోసపాటి ప్రసాద్, దాసరి మోహన్, దోసపాటి తుమ్మయ్య, దైద ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దసరా శరన్నవరాత్రులు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ శ్రీ శుకస్యామలాంబ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గత తొమ్మిది రోజులుగా దసరా శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని నందిగామ రామలింగేశ్వర స్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త, చైర్మన్ రాజా వాసిరెడ్డి మురళీ రాఘవ కుమార్, కార్యనిర్వహణాధికారి సురేష్ పేర్కొన్నారు. దసరా పండగ సందర్భంగా బుధవారం వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ దాతల సహకారంతో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరిగాయని తెలిపారు. ఆలయ నిధులతోపాటు తమ సొంత నిధులు కూడా జోడించి రామలింగేశ్వర స్వామి దేవస్థానం పున:నిర్మాణం, ప్రహరీ గోడ నిర్మాణం, ఆలయం నాలుగు మూలల శ్రీ రామేశ్వర, శ్రీ సోమేశ్వర, శ్రీ భీమేశ్వర, శ్రీ చంద్రమౌళీశ్వర ఆలయాలు అత్యంత శోభయమానంగా నిర్మిస్తున్నామని తెలిపారు. లక్షలాది రూపాయల వ్యయంతో స్వామివారి రథం షెడ్డును నిర్మించినట్లు తెలిపారు.

కొండపల్లిలో వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి సీనియర్ సిటిజన్స్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా బుధవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, ఎన్టిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ రామాంజనేయులు ముఖ్య అతిథిలు గా కార్యక్రమానికి హాజరయ్యారు. వారి చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ అయిపోయి వృద్ధాప్యంలో కూడా సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకొచ్చిన అసోసియేషన్ సభ్యులను అభినందించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ ఛైర్మన్, చీఫ్ ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ కేవి ఆచారి, అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జిఎస్‌టితో రైతులకు మేలు

ప్రజాశక్తి - తిరువూరు : ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం ప్రకటించిన సూపర్ జిఎస్‌టితో రైతాంగానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయని అధికారులు తెలిపారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోకిలంపాడు తదితర గ్రామాల్లో సచివాలయం సిబ్బంది అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పనిముట్ల కొనుగోలుపై ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని, దీనివల్ల విడిభాగాల ధరలు తగ్గి రైతులకు అదనపు ఆదాయ చేకూరుతుం దని తెలిపారు. కొత్త జీఎస్టీ వల్ల మిరప, మొక్క జొన్న పంటలు సాగు చేసిన రైతులకు హెక్టారుకు రూ.5000 వరకు ఆదా అవుతుందని వివరించారు.

భరోసా పింఛన్లు పంపిణీ

విజయవాడ : సామాజిక భద్రత పెన్షన్లను విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం పంపిణీ చేశారు. నగరంలోని లక్ష్మీనగర్ భగత్ సింగ్ రోడ్, అజిత్ సింగ్ నగర్, పిఎన్‌టికాలనీ, ఎక్సెల్ ప్లాంట్ గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్ల వద్దే అందిస్తున్నట్లు తెలిపారు. **చందర్లపాడు:** రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు చందర్లపాడు మాజీ జడ్‌పిటిసి, కోనాయపాలెం పిఏసిఎస్ బ్యాంక్ చైర్మన్ వాసిరెడ్డి ప్రసాద్ తెలిపారు. కోనాయపాలెం, పాతబెల్లం కొండవారిపాలెం బుధవారం వేకువజామునే సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, రాజకీయ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోకా వెంకటేశ్వరావు, పెంట్యాల బాబు, వడ్లమూడి లక్ష్మీనారాయణ, గద్దె హనుమంతు, మార్కపూడి కుమార్, ఉలవలపూడి వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు **రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండలంలో ఎన్టీఆర్ భరోసా ఫించన్లను బుధవారం పంపిణీ చేశారు. టిడిపి నాయకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి రెడ్డిగూడెంలోని బిసి కాలనీలో పర్యటించి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పైడిమర్ల కిరణ్ కుమార్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. **విజయవాడ సిటీ :** భవానీపురం 39వ వార్డ్‌లో జరిగిన పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వైశ్య సంక్షేమ అండ్ అభివృద్ధి సంస్థ చైర్మన్ డూండి రాకేష్‌తోపాటు 39వ డివిజన్ ప్రెసిడెంట్ శివ శర్మ, డివిజన్ సభ్యులు, పశ్చిమ నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ప్రతీ నెలా 1వ తేదీన పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. **వత్సవాయి :** మండలంలోని డబ్బాకు పల్లి గ్రామంలో వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, కళాకారులు, చేనేత కార్మికులకు పెన్షన్లు పంపిణీ చేశారు. డబ్బాకుపల్లి సొసైటీ అధ్యక్షులు పెంట్యాల శ్రీనివాసరావు పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం మండల నాయకులు నరేష్, వంశీ, పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని 8వ వార్డు తొర్రగుంటపాలెంలో అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కేవలం పెన్షన్ కాదని, పేదల జీవితానికి ఆర్థిక బలం ఇచ్చే ప్రజా సంక్షేమ హామీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర రంగాపురం, మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకష్ణ, పట్టణం తెలుగు యువత అధ్యక్షులు వేదుల పూరి సైదా, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

చందర్లపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న వాసిరెడ్డి ప్రసాద్

రేపటి నుంచి పిహెచ్‌సి వైద్యుల నిరవధిక దీక్షలు

సమ్మెలో పాల్గొన్న పిహెచ్‌సి వైద్యులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీహెచ్సీ వైద్యులు చేపట్టిన సమ్మె కొనసాగింది. సమ్మెలో భాగంగా పీహెచ్సీలలో వైద్యసేవలను బహిష్కరించారు. బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పిహెచ్సి వైద్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలతో కార్యాలయం ప్రాంగణం హోరెత్తించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పి.దీప్తి మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గురువారం చలో విజయవాడకు పిలుపునిచ్చారు. 3 నుండి విజయవాడలో నిరసనలు, నిరవధిక నిరాహార దీక్షలు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు ప్రత్యేక అలవెన్స్, సమయానికి ఉద్యోగోన్నతులు, ట్రైబల్ అలవెన్స్, 104 సంచార చికిత్స అలవెన్సులు, నేషనల్ ఇంక్రిమెంట్ కల్పించాలని డిమాండ్ చేశారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ ఒకొక్క పీహెచ్సీ పరిధిలో 30 వేల నుండి 40 వేల మంది ప్రజలు ఆధారపడి ఉన్నారని, నిరంతరంగా 24 గంటలు విధుల్లో ఉండే వైద్యులకు ఎటువంటి సెలవులు లేకపోవడం తీవ్ర సమస్యగా మారిందన్నారు. పీజీ ఇన్‌సర్వీస్ కోటా అన్ని క్లినికల్ స్పెషాలిటీలకు 20 శాతం వర్తించాలని, అయితే కోటాను కూటమి ప్రభుత్వం ఈ ఏడాది 15 శాతానికి తగ్గించి ఉన్నత విద్యా అవకాశాలకు గండి కొట్టిందన్నారు. డాక్టర్లకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పిస్తేనే ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించగలరని ప్రభుత్వం గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కపిలేశ్వరం పీహెచ్సీ డాక్టర్ ఎం. బాలాజీ, అవనిగడ్డ పిపి యూనిట్ డాక్టర్ మహేష్, రామాపురం డాక్టర్ స్ఫూర్తి, పెనమలూరు డాక్టర్ రాజా, ఉప్పులూరు డాక్టర్ చంద్రిక, పెడన డాక్టర్ పర్వేజ్, డిఎంహెచ్ఓ కార్యాలయం డాక్టర్లు అరుణ్ కుమార్, నీరిక్షణ, మోటూరు డాక్టర్ తేజ తదితరులు పాల్గొన్నారు.

బోరు పంపులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పమిడిముక్కల

గ్రామాల అభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచుతాయని మండల వైసిపి ప్రధాన కార్యదర్శి గొరికపూడి బుజ్జి అన్నారు. బుధవారం మండలంలోని మేడూరు గ్రామంలో జడ్పిటిసి ఏనుగు వెంకటరమణ నిధులతో రెండు బోరు పంపులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గురువిందపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్ధిని దేవిగా దుర్గమ్మ

ప్రజాశక్తి -విజయవాడ సిటీ

దసరా ఉత్సవాల సందర్భంగా చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారు బుధవారం శ్రీ మహిషాసుర మర్దని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళాశ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ దసరా వేడుకలను పురస్కరించుకొని ప్రతి రోజు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు దేవస్థానానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారని

చెప్పారు. ప్రతినిత్యం దేవస్థానం ప్రాంగణంలోని కళావేదికపై సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, సహాయ కార్యదర్శిలు పొట్నూరి దుర్గాప్రసాద్ (రాజా), శీరం వెంకటరావు, కమిటీ సభ్యులు కామందుల నరసింహారావు, మజ్జి శ్రీనివాసరావు, మజ్జి ఈశ్వరరావు, పోతిన సాంబశివరావు, పిళ్ళా విజయ్ కుమార్, బంక హనుమంతరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ: పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపుమేరకు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం పోలినాయుడు ఆధ్వర్యంలో బుధవారం అవనిగడ్డ గ్రామపంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు ఎర్రంశెట్టి రమాదేవి, వై గృహలక్ష్మి, బి బాపనమ్మ, ఏ సాంబశివరావు, ఎక్కటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0తో ప్రజలకు లబ్ధి : ఎంపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో లబ్ధి చేకూరిందని బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని రహదారులు భవనాల అతిథి గృహంలో జిఎస్టి 2.0 సంస్కరణల ప్రయోజనాలను ఎంపి వివరించారు. జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల ధరలు తగ్గి ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, దీనివల్ల ఒక్కొక్క కుటుంబానికి దాదాపు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు లబ్ధి చేకూరినట్లు తెలిపారు. ఇది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఊరట కలిగించే అంశమని పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణలతో సామాన్య ప్రజలకు ఏ విధంగా మేలు జరిగిందనేది నియోజకవర్గాలలోని ప్రజా ప్రతినిధులు ఇప్పటికే ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కృష్ణా డెల్టాకు వెన్నుముక అయిన పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ నిధులను తీసుకువచ్చి శరవేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మచిలీపట్నం పోర్టు దాదాపు పూర్తి కావాల్సివస్తోందని, రాబోయే సంవత్సర కాలంలో పోర్టు కార్యకలాపాలను ప్రారంభిస్తామన్నారు. పోర్టు అనుసంధాన రహదారులకు డిపిఆర్‌లు సిద్ధమై, టెండర్లు పిలిచే దశకు చేరుకున్నాయన్నారు. హైదరాబాదు నుంచి అమరావతి వరకు గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్ట్ కొత్తగా రూపుదిద్దుకోనున్నదని, దానిని మచిలీపట్నం వరకు కొనసాగిస్తామని, ఆరు వరుసల రహదారి నిర్మాణంతో ఇది రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) ఛైర్మన్ బండి రామకృష్ణ, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంటి కృష్ణయాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాదివాడ రాము పాల్గొన్నారు. **కోడూరు:** వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించి ప్రభుత్వం రైతుకు చేయూత అందిస్తుందని మచిలీపట్నం జీఎస్టీ అధికారిణి యం.స్వరూప తెలిపారు. సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్ కార్యక్రమాన్ని కోడూరు రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించారు. వ్యవసాయ ఆధారిత రంగాలైన వెటర్నరీ, ఆక్వా రంగాలలో జిఎస్టి రైతులకు కలుగు ప్రయోజనాలను వివరించారు. కోడూరు వ్యవసాయ అధికారి ఎం శ్రీధర్, వెటర్నరీ డాక్టర్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు. **మొవ్వ:** మండల పరిధిలోని కూచిపూడి గ్రామపంచాయతీ ప్రాంగణంలో బుధవారం సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొని సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పాంప్లెట్స్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి భర్త అమర బాలేశ్వరరావు, మండల కార్యదర్శి వీరంకి తులసీదాస్, పద్మ, జొన్నలగడ్డ సామ్రాజ్యం పాల్గొన్నారు. **మోపిదేవి:** ఉత్తర చిరువోలు లంక గ్రామంలో ప్రజలకు జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నడకుదిటి జనార్ధనరావు, వైస్ ఎంపిపి నడకుదిటి జననీకుమారి, నడకుదిటి జగదీశ్ పాల్గొన్నారు. **పామర్రు:** జీఎస్టీ తగ్గింపుతో సాధారణ కుటుంబాలకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని ముఖ్యంగా కూలీలు, రైతులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి ప్రజల జీవన వ్యయాలు తగ్గుతాయని జీఎస్టీ నోడల్ అధికారి సలాం అన్నారు. గొలువేపల్లిలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ కే.జ్యోతి, వ్యవసాయ శాఖ ఏడిఏ బి.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** గుడ్లవల్లేరు పాత మండల ఆఫీస్ భవనంలో రేషన్ షాప్ వద్ద జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు. **చల్లపల్లి:** జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు ప్రయోజనం కలుగుతుందని కమర్షియల్ టాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ మన్నెం స్వరూపరాణి తెలిపారు. యార్లగడ్డ రైతు సేవా కేంద్రం వద్ద జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు ట్రాక్టర్‌తో ర్యాలీ నిర్వహించారు. ఏవో మురళీకష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్ కుమారి, ఉద్యానవన శాఖ అధికారిణి జె.కీర్తి, పంచాయతీ కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **కంకిపాడు:** గొడవర్రు, కంకిపాడు గ్రామాలలో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ జిఎస్టి, స్టేట్ టాక్సెస్ పెనమలూరు డివిజన్ ఏ.చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి వి.ఉషారాణి, వ్యవసాయ విస్తరణ అధికారి భవాని పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి బాలశౌరి

చల్లపల్లిలో...

మొవ్వలో...

ఎంపి బాలశౌరికి సన్మానం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలసౌరిని పాగోలు ఎంపీటీసీ, ఆచలాచల బోధోపదేశ మందిరం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ మేకా సత్యనారాయణ ప్రసాద్(బంగారుబాబు) బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయదశమి శుభాకాంక్షలు తెలియచేసి ఎంపీని దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. మంగలాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, టీఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు చంద్ర వెంకటేశ్వరరావులు ఎంపీని కలిసి సత్కరించిన వారిలో ఉన్నారు.

వైద్యులు సమ్మె విరమించాలి : యలమంచిలి

ప్రజాశక్తి-కంకిపాడు: ప్రస్తుత వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందిస్తున్న వైద్యులు ఈ నెల 3వ తేదీ నుంచి తలపెట్టిన సమ్మెను మానవతా దక్పథంతో ఆలోచించి విరమించాలని కంకిపాడు ప్రభుత్వాసుపత్రి మాజీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్‌బాబు విజ్ఞప్తి చేశారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చల ద్వారా తమ డిమాండ్లు పరిష్కరించుకునే దిశగా ముందడుగు వేయాలని కోరారు.

గోశాలకు పశువులు తరలింపు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: బందరులో రోడ్లపై తిరిగే ఆవులతో ప్రజలందరికీ ఎదురవుతున్న ఇబ్బందులు, రహదారి ప్రమాదాలు దృష్టిలో పెట్టుకుని మొబైల్ వ్యాన్ ద్వారా బందుల దొడ్డికి తరలిస్తున్నట్లు మచిలీపట్నం నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున ప్రారంభించిన మొబైల్ వ్యాన్ మచిలీపట్నం పురవీధుల్లో 24 గంటలు తిరుగుతూ రోడ్లపై కనపడిన పశువులను మార్కెట్ యార్డ్‌లోని గోశాలకు తరలిస్తుందన్నారు. నాలుగు రోజుల్లో వాటి యజమాని వచ్చి అపరాధ రుసుము చెల్లించి తీసుకెళ్లకపోతే 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నవరం తదితర పుణ్యక్షేత్రాల గోశాలల కి తరలిస్తామన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర చొరవతో మచిలీపట్నంకు చెందిన అరవ శ్రీనివాసరావు మొబైల్ వ్యాన్ సమకూర్చారని తెలియజేశారు.

మంచి ఆహార అలవాట్లను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాలని పోషకాహార నిపుణులు పి.లీలా కృష్ణ స్వామి తెలిపారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా నగరంలో అవగాహనా బుధవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా లీలా కృష్ణ స్వామి మాట్లాడుతూ ఆహారంలో కాలిఫోర్నియా బాదంను చేర్చుకోవాలని సిఫారసు చేశారు. '200కుపైగా ప్రచురించబడిన అధ్యయనాలు కాలిఫోర్నియా బాదం అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని చూపించాయని తెలిపారు. అవి గుండె ఆరోగ్యకరమైన మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, విటమిన్ ఇ, మెగ్నీషియం, పొటాషియం, డైటరీ ఫైబర్‌తో సహా 15 అవసరమైన పోషకాలను అందిస్తాయన్నారు. బాదంను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మొత్తం కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుందని, అలాగే గుండె జబ్బులతో సంబంధం ఉన్న ఇన్‌ఫ్లమేషన్ మార్కర్లను కూడా తగ్గిస్తుందని శాస్త్రీయంగా నిరూపించబడింది' అని పేర్కొన్నారు. బాదంతో నిరంతర శక్తి లభించి, మొత్తం ఆరోగ్యాన్ని బాదం మెరుగుపరుస్తుందని ఆమె వెల్లడించారు.

పెండింగ్ పింఛన్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : పెండింగ్‌లో ఉన్న పింఛన్లు మంజూరు చేసి ఎన్నికల హామీలను నెరవేర్చాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బి.సత్యబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా పెన్షన్లు మంజూరు చేయకపోవడం వలన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు వివిధ వృత్తిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బుధవారం 50వ డివిజన్‌లో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలుకావస్తున్నా కొత్తగా పింఛన్లు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు.

శామ్‌సంగ్ గెలాక్సీ వేరబుల్స్‌పై పండుగ ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ తన తాజా గెలాక్సీ వేరబుల్స్‌పై ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి ఎస్.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గెలాక్సీ వాచ్8 సిరీస్ గెలాక్సీ బడ్స్3 ఎఫ్ఈతో సహా, మునుపెన్నడూ చూడని ధరలను ప్రకటించిందన్నారు. పండుగ సీజన్‌కు ముందు భారీ డిస్కౌంట్‌లను పొందే ఇతర ఉత్పత్తుల్లో గెలాక్సీ వాచ్ అల్ట్రా, గెలాక్సీ రింగ్ కూడా ఉన్నాయని వెల్లడించారు. ఈ ప్రత్యేక డిస్కౌంట్‌లు కస్టమర్‌లకు గెలాక్సీ వేరబుల్స్‌ను వాటి లాంచ్ నుండి అత్యంత ఆకర్షణీయమైన ధరలకు సొంతం చేసుకోవడానికి ఒక అద్భుతమైన అవకాశాన్ని అందిస్తాయని తెలిపారు

ఎన్‌టిఆర్ భరోసాతో పేదలకు సామాజిక భద్రత

- కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ

పేద ప్రజల సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యమని ఎన్‌టిఆర్ భరోసా ద్వారా పేదల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు, పేదరికం లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో భాగంగా బుధవారం విజయవాడ అర్బన్ 14వ వార్డు పుట్టారోడ్ ప్రాంతంలో అధికారులతో కలిసి లబ్దిదారులకు సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవకతవకలకు తావులేకుండా అత్యంత పారదర్శకత జవాబుదారీతనంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్ల వద్దే అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్నామన్నారు. జిల్లాలో సామాజిక భద్రత పెన్షన్ల ద్వారా 2,29,874 మంది లబిద్ధారులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వివిధ క్యాటగిరీల పెన్షన్లకు సంబంధించి రూ.99 కోట్ల 27 లక్షల మొత్తాన్ని లబ్దిదారులకు అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.



ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు శీలత్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.